

# 18

# శబ్దాలు, పదాలూ

శబ్దాలంటే నాకిష్టం. ఒంటరిగా, మహా సమూహంగా, మౌనంగా- మంచి సూక్తి, మనోహరమైన కృతి- కేరింత, చిరునవ్వు, తుపాకీ పేలిన చప్పుడు, హాహాకారం, ఝంజ, పావురాలు ఎగురుతున్న టపటప, గడ్డిపూలపైన పాదాలు, ఉంగా, ఉంగా- శబ్దం నా బలహీనత. శబ్దాలు వినలేని క్షణాలు ఊహించలేను. వీలైనన్ని శబ్దాల్ని సేకరించాలని నా ఆరాటం. నేనో సౌండ్ ఇంజనీర్ని. అయితే శబ్దాల్ని డెసిబెల్స్‌లో కొలవను. ఒక మానవానుభవంతో కొలుస్తాను. శబ్దం శ్రావ్యంగా ఉండటం కాదు, అది మెదడుపై ఏ ముద్రని వేస్తుందా అని గమనిస్తుంటాను. కమ్మటి పాటలోను, కవిత్వంలోను, మనుషుల మధ్యసాగే సంభాషణలోను, ఆఖరికి కోప తీవ్రతలోని హుంకారంలోను, ఎటు చూసినా శబ్దాలే. ఈ శబ్దానికి ముందూ వెనుకా ఏమిటనేది నా పరిశోధన.

నేనొక రాజకీయ పార్టీ ప్రచారపు క్యాసెట్లను రికార్డు చేయటానికి ఈ ఊరు వచ్చాను. నాకు పెద్దగా రాజకీయాలు తెలియవు. రాజకీయ పార్టీలన్నీ బాగా కుళ్లిపోయి, నాచుపట్టి 'లుకలుక'లాడే బురద గుంటల్లాంటివని నా నమ్మకం. అయితే 'ఈ పార్టీకా?' అని నాకు తెలిసిన ఇద్దరు, ముగ్గురు మిత్రులు అయిష్టం వ్యక్తం చేశారు.

ఫండమెంటలిజమ్, ఫెనటిజమ్, అమానవీయం, మానవద్వేషం లాంటి మాటలు ఈ పార్టీ గురించి ఈ మిత్రులే చెప్పారు. అగ్రిమెంట్‌పై సంతకం చేశాను. మొత్తం యాభై వేలు. చెక్కు కూడా తీసుకొన్నాను. పదిహేను నిముషాల పాటు సాగే డాన్స్ బాలే అది. మధ్యలో కొన్ని ఉపన్యాసాలు, కొన్ని ఓంకారాలు, కొన్ని జేగంటలు, కొన్ని భగవన్నామాలు- అన్నింటినీ కలపాలి. రెండు మూడు దశల్లో ఈ రికార్డింగ్ సాగాల్సి ఉంది. ముందు పాటను రికార్డు చెయ్యాలి. ఆపైన ఈ నేపథ్యాలన్నీ రీమిక్స్ చేసుకోవాలి.

*

ఒక బ్రహ్మాండమైన విస్ఫోటనం. అణువిచ్ఛేదం. శబ్దాన్ని టేప్‌పై బంధించడం చాలా కష్టమైంది. భూమి క్రమంగా నెర్రలిచ్చి, ఒక్కసారిగా పక్షులు టపటపమంటూ ఎగిరి, ఇసుక తుఫాను రేగినట్లు, ఒక మేఘం అట్లా భగ్గుమని తగలబడుతున్నట్లు- రికార్డింగ్ మొదలైంది. శాక్సాఫోన్, వయొలిన్, తబలా, వేణువు లాంటి ఐదారు వాయిద్యాలలో నేపథ్యాన్ని అమరుస్తున్నాడు దయానిధి. డాక్యుమెంటరీ చిత్రాలకు సంగీతం అమర్చే పాతికేళ్ల కుర్రాడు. స్కూళ్లన్నీ గాలించి కాస్తంత కంఠ శుచి ఉన్న పదిమంది పిల్లవాళ్లను పాట పాడడానికి తీసుకొచ్చారు. అద్భుతమైన బృందగానం, పిల్లల్ని చాలా రోజులపాటు ప్రాక్టీసు చేయించినట్లున్నారు. కానీ పాట మొత్తంలో ఒక అపశృతి. అపశృతి కూడా కాదు. డిఫరెంట్ పిచ్‌లో ఉంది. ఆ గొంతు ఒక్కటే విడిగా- దయానిధి విసుక్కున్నాడు. ఏడెనిమిది రిహార్సల్స్ చేయించాడు. ఆ తరువాత కూడా- ఆ ఒక్క స్వరం- ఆరేళ్ల కుర్రవాడు- కంఠంలో గొప్ప మాధుర్యం ఉంది. కానీ మిగిలినవాటి కంటే భిన్నంగా ఉంది. ఏమిటి తేడా అంటే స్పష్టంగా చెప్పలేకపోతున్నాడు దయానిధి.

ఆ కుర్రవాడి పేరు రమణ. పాట కమ్మగానే పాడుతున్నాడు. కాకుంటే మరీ 'లో పిచ్'లో. అది పాటో, దు:ఖమో, వణుకో తెలియనట్లుగా ఉంది. పైగా కొద్దిగా నత్తి కూడా ఉన్నట్లుంది. అతన్ని పక్కన పెట్టి రికార్డింగ్ చేద్దాం అంటాడు దయానిధి. ఊహు! నాకిష్టం లేదు. ఇన్ని వందల స్వరాల్లో భిన్నంగా ఉన్న స్వరం. ఈ కుర్రవాణ్ణి శోధించాల్సిందే. ప్రత్యేకంగా ఉన్న ఈ శబ్దం వెనుక పసివాడి గుండెను తడమాల్సిందే.

జ, య. తెకు ఏత్వమిస్తే తెకు దీర్ఘమిస్తే.. తే... జయతే...

జయ... తే... తే... ఆ కుర్రాడు తే అనే అక్షరం దగ్గరే ఆగిపోతున్నాడు. ముఖంలో కండరాలు బిగుసుకుపోయి, స్వరపేటిక, శబ్దాన్ని ఉచ్ఛరించటానికి నిరాకరిస్తున్నట్లుగా- తెకు ఏత్వమిస్తే తే. తల్లి విసుగులేకుండా బోధిస్తుంది. ఆమె ముఖంలో దు:ఖం, దిగులు. వాడి ముఖంలో భయం, అపనమ్మకం. విశాలమైన కళ్లు. కానీ కళ్లనిండా ఏదో తెలియని చీకటి. ప్రాక్టీస్ కొనసాగుతూనే ఉంది. క్షణంపాటు అద్భుతంగా పాట మొత్తాన్ని శ్రావ్యంగా పలుకుతాడు. అంతలోనే- కిందకు జారిపోతుంది స్వరం, గొంతునెవరో

బలిమిన పిసుకుతున్నట్లు. దయానిధి హడావుడి చేస్తున్నాడు. 'చూశావా ఒకరోజు వేస్ట్ చేశావు?' అన్నట్లు నావైపు చూస్తున్నాడు. కొరియోగ్రాఫర్ వేణుగోపాల్ కూడా వచ్చాడు. డాన్స్ బాలేకు రిహార్సల్స్ చేసుకోవాల్సి ఉంది. పాట రెడీ అయితేగానీ డాన్స్ రిహార్సల్స్ సాగదు. ఈ రెండు కార్యక్రమాలు అయితే రేపటి నుండి వీడియో షూటింగ్.

వేణుగోపాల్ కూడా, 'ఒక కుర్రవాడి కోసం, మొత్తం షెడ్యూల్ అంతా డిస్టర్బ్ చేస్తావా?' అని విసుక్కొన్నాడు. చాన్నాళ్లపాటు ఆనందశంకర్ ట్రూప్‌లో పనిచేశాడు. ఇట్లాంటి ప్రోగ్రామ్స్ ఒప్పుకోవడమే గొప్ప. శ్రీలంక నుండి, పేరుమోసిన మాస్క్ ఫ్యాక్టరీ నుంచి, నలభై దాకా ప్రత్యేకమైన మాస్క్‌లు తెప్పించాడు. పలుచని నక్సవామికా బెరడుతో అద్భుతంగా కార్వ్ చేసినవి. కోపం, దు:ఖం, భక్తి, పారవశ్యం, యుద్ధావేశం, విజయధావనం- అన్ని రసాలను చూపించే మాస్కులు. గోడ పొడవునా తగిలించి ఉన్నాయి. ఒక్కో మాస్క్‌ను పిల్లవాళ్లకు తగిలించి సైజులు సరిచూసుకొంటున్నాడు వేణుగోపాల్. విసుగ్గా తబలా చప్పుళ్ల కాలుష్యం వెదజల్లుతున్నాడు దయానిధి.

స...త కు యా వత్తు ఇస్తే త్య...మ్... సత్యం, గట్టిగా వత్తి పలుకుతుందా తల్లి. ఆ తల్లితో పరిచయం చేసుకొన్నాను. పాతికేళ్ల వయసు ఉండి ఉంటుంది. గొప్పగా చదువుకొన్నది కాదు. కానీ సంగీతం, నాట్యం లాంటి కళలపై ప్రేమ ఉన్నది.

"ఆరు నెలలుగా స్పీచ్ థెరపీ కూడా ఇప్పిస్తున్నాను. కానీ ఏం మార్పు కనబడటం లేదు. మామూలుగా బాగానే ఉంటాడు. కానీ హఠాత్తుగా ఏదో గాలి సోకినట్లుగా అయిపోతాడు. వణుకు మొదలౌతుంది. పదాలు గొంతులోనే పట్టేస్తాయి," అంది.

విశాలమైన హాలు. డాన్స్ కోసం ఏర్పాటు చేయబడ్డ స్టేజ్ సెట్టింగులు. పిల్లలందరూ అక్కడే ఒక మూలన కూర్చుని ఉన్నారు. రమణని, వాడి తల్లిని దూరంగా తీసుకెళ్లాను. అయితే ఆ విశాలమైన హాలులో ఎటు వెళ్లినా చప్పుడు చప్పుడుగానే ఉంటుంది. పిల్లల అరుపులూ, మేకప్‌మ్యాన్ల హడావుడీ, వాయిద్యాలు సరిచూసుకోవడాలు ఎటూ పారిపోలేని శబ్దాల మడుగు అది.

"ఇప్పుడైతే ఇట్లా ఉన్నాడుగానీ సంవత్సరం క్రితం వీడి కంఠం చక్కగా ఉండేది. ముత్యాలు దొర్లినట్లు మాటలు. పాటల్నిగానీ, చప్పుళ్లుగానీ వినడం, వాటిని అనుకరించి ప్రాక్టీసు చెయ్యడం, రోజూ అదో కార్యక్రమం. పిచికలు కిచకిచమన్నా, కొత్తవాళ్లెవరైనా మాట్లాడుకొంటున్నా పరిగెత్తుకొస్తాడు. జాగ్రత్తగా ఈ చప్పుళ్లని వినేవాడు. పగలల్లా ప్రాక్టీసు చేసేవాడు. రాత్రి పడుకున్నప్పుడు, మంచం దగ్గరకొచ్చి తను విన్న కిచకిచల్నీ, పాటల్నీ అరచి చూపించేవాడు. గొప్ప మిమిక్రిస్ట్ కూడా. కార్లు దూసుకుపోవటం, పుస్తకాలు జారిపడటం, కుర్చీలు లాగటం, ఆఖరికి గొంతులోంచి నీళ్లు గుటగుటమనటం, అన్నింటినీ అనుకరించి చూపుతాడు.

"పోయిన సంవత్సరం, స్కూల్లో జరిగిన గొడవ- వీడు బాగా భయపడిపోయాడు. ఆ వేళ మేం కూడా బాగా కంగారుపడ్డాం. ముందు భాగం అంతా మంటలు. పిల్లలకు ఎటు పరిగెత్తాలో తెలియదు. బయట ఉన్న కార్యకర్తలు లోపలికి పోనివ్వరు. ముందు బైబుళ్లు మాత్రమే తగలబెడతామన్న వీళ్లు, చర్చికి కూడా నిప్పుపెట్టారు. స్కూల్ వ్యాన్‌కి కూడా. వ్యాన్‌లో ఫాదర్, మిగిలిన టీచర్లు ఉన్నారని పుకారు. పిల్లలు ఒకటే గొడవ. 'మిస్... మిస్...' అంటూ. రమణ ఏమైనాడో తెలియదు. కొద్దిగా పెద్దపిల్లలు అయితే ఫర్వాలేదు. వీడు మరీ పసివాడు. స్కూలంతా కంగారుగా వెతికాను. తగలబడుతున్న వ్యాన్ దగ్గరే నిలబడ్డాడు. ముఖం ఎర్రగా, చెమటలు పట్టి, చావును దగ్గర నుంచి చూసినవాడిలా ఉన్నాడు. అట్లాగే నిలువు గుడ్లు వేసుకొని శాపం పెట్టబడ్డవాడిలా. ఇంటికి వస్తూనే 104 డిగ్రీల జ్వరం. పది రోజులపాటు మంచం దిగలేదు. ఆ తరువాతే వాడిలో నత్తి మొదలైంది. అదీ అన్ని పదాలకు కాదు. భగవంతుడు, జ్ఞానం, ఆలోచన లాంటి సీరియస్ విషయాలకు సంబంధించిన పదాలకూ వస్తుంది. జ్ఞానం అనేమాట అసలు పలకలేడు. చిన్నచిన్న మాటలు మనిషి, సమూహం, ఆలోచన లాంటి మాటలు కూడా ఒక్కోసారి పట్టేస్తాయి. ఇదుగో ఇట్లా పాటలు పాడించాలంటే మరీ ఇబ్బంది."

ఆమె చెప్పిన పదాలన్నీ మళ్లా ప్రాక్టీస్ చెయ్యటం మొదలుపెట్టాం. ఇవాల్టి పాటలో ఉన్న జయతే, సత్యం లాంటి మాటలు. ఉహూ, ఆ పదాల్ని మరిచిపోయిన వాడిలా, రమణలో ఏ మార్పూ లేదు.

దయానిధి ఇచ్చిన టైమ్ అయిపోయింది. రికార్డింగ్ మొదలైంది. మళ్లీ మైకు దగ్గరకు వచ్చాడా కుర్రాడు. ఫ్లూట్, వయోలిన్, సింథసైజర్, తబలా, జాజ్‌లాంటి పరికరాలు ఒక్కసారిగా ఝుమ్మన్నాయి. పిల్లల గొంతుకలు తెరుచుకొన్నాయి. అద్భుతమైన సంగీతం. హాయైన శబ్దాల వరదలో- హఠాత్తుగా ఒక అపశృతిలా- రమణ కంఠం. అట్లాగే రికార్డింగ్ కొనసాగించాం.

*

అద్భుతమైన మాస్కులు, కోపతీవ్రతను, యుద్ధ బీభత్సాన్ని, మహా సౌందర్యాన్ని, పరమ వంచననీ, వేడుకనీ- ఏ భావాన్నైనా గొప్పగా సూచించే మాస్కులు. సైజులవారీగా, పాత్రల సాంఘిక స్థాయిని బట్టి పెద్దవి, అలంకార సహితమైనవి లేదా చిన్నచిన్నవి అలంకారాలు లేనివి. ఫీల్టింగ్స్‌ని గొప్పగా కార్వ్ చేసిన మాస్కులు. స్టూడియో నిండా పరిచి ఉన్నాయి. మరో కొత్త పౌరాణిక యుగంలోకి అడుగుపెడుతున్నామనే భావన. మొత్తం పాతికమందికి పైగా కళాకారులు. వాళ్లలో రమణతో సహా పాటలు పాడిన పిల్లలు కూడా ఉన్నారు. వాళ్లు ప్రత్యేకంగా నటించనవసరం లేదు. మాస్క్ నిండా అభినయాలే. భ్రుకుటి ముడిచినట్లు, పెదవి విచ్చుకొని నవ్వు వెలిగినట్లు, కళ్లనిండా దు:ఖం పొంగుతున్నట్లు-

మాస్కనట్లా ధరిస్తే చాలు. మనమో కాల్పనిక మానవుడిగా రూపాంతరం చెందుతామేమో ననిపించేలా ఉన్నాయి.

రమణకి బాలరాముడి మాస్క్ ఇచ్చారు. శాంత గంభీరంగా, ఆప్యాయత నిండిన దరహాసంతో- కుర్రవాడి ముఖానికి సరిగ్గా సరిపోయింది. నాలుగైదు వీడియో కెమెరాలు, లైట్లు, ఫోకసింగ్‌లు- కొరియోగ్రాఫర్ వేణుగోపాల్ రిహార్సల్ హడావుడిలో ఉన్నాడు.

లైట్లు వెలిగి, రికార్డింగ్ చెయ్యబడ్డ పాటను ఆన్ చేసి, క్రమంగా మాస్కులు, అద్భుతమైన ఆహార్యం ఉన్న పాత్రలుగా ముందుకు వచ్చి- రాముని జన్మదినం, అయోధ్యలో కోలాహలం- బాలరాముడి ప్రవేశం- మెల్లగా, మృదువుగా అడుగులు వేసుకుంటూ, అందరూ ఆ రూపానికి మోకరిల్లుతుండగా, హఠాత్తుగా రాముడిలో వణుకు. భయవిహ్వలత- అమ్మా అంటూ అరుస్తూ, మాస్క్ విసిరేసి రమణ, 'కట్, కట్' - 'వాట్ నాన్సెన్స్' వేణుగోపాల్ విసుగు, అసహనం. బాలరాముడి మాస్క్ తీసివేసి, భయంతో తల్లి దగ్గరకు పరిగెత్తి, ఎక్కి ఎక్కి ఏడుస్తున్నాడు రమణ.

''పిల్లవాడు భయపడ్డాడు. నేను నర్దిచెబుతాను!'' తల్లి దీనంగా బతిమిలాడుతోంది. వేణుగోపాల్ బాగా సీరియస్ అయ్యాడు. బాలరాముడి పాత్రకు మరో కుర్రాణ్ణి సెలక్ట్ చేశారు. ఒక భటుడి వేషం రమణకి ఇచ్చారు. మళ్లీ షూటింగ్ మొదలైంది.

''ఆ సంఘటన వాణ్ని బాగా డిస్ట్రబ్ చేసింది. దానికి తోడు మావారి చాదస్తం. ఇంగ్లిష్ కామిక్స్ చదవద్దంటారు. టీవీలో వచ్చే కార్టూన్ నెట్‌వర్క్‌లాంటివి కూడా వద్దంటారు. జై హనుమాన్, రామాయణం లాంటి సీరియల్సే చూడాలంటారు.

''ఒకసారి మా తమ్ముడు ఢిల్లీ నుండి వాడికి బార్బీడాల్ తెచ్చాడు. అమ్మాయి బొమ్మ అది. స్కర్ట్, మిడ్డీ వేసుకున్న బొమ్మ అది. దాన్ని వాళ్ల నాన్నకు చూపాలంటే భయం. రహస్యంగా బెడ్ కింద దాచిపెట్టాడు. ఆ తరువాత పెరట్లో ఒక మూలన రాళ్ల మధ్యనో రహస్య ప్రదేశం దొరికింది వాడికి. బొమ్మనక్కడ దాచేశాడు. సాయం కాలాలు స్కూలు తరువాత నేరుగా పెరటి వెనక్కు వెళ్లేవాడు.

''ఒకసారి నా అల్మారాలో చీరలన్నీ ముక్కలు ముక్కలుగా చిరిగి ఉన్నాయి. ఎవరు చింపారో అర్థంకాలేదు. సాయంకాలం పూట చీర ముక్కలన్నీ తీసి బార్బీబొమ్మకు చుడుతున్నాడు రమణ. దాని స్కర్ట్ అన్నీ పీకేసి, ఒక్కొక్క పొరా చీరను చుట్టి దాన్ని నా దగ్గరకు తెచ్చి 'ఇంక ఇంట్లోకి తేవచ్చా మమ్మీ!' అని అడుగుతున్నాడు.

''మొన్న ఆదివారం పెరట్లో గొయ్యి తవ్వుతూ కనపడ్డాడు రమణ. కామిక్ పుస్తకాల్ని, ఇంకా స్కూల్లో ఇచ్చిన ఇంగ్లిష్ పుస్తకాల్ని లోతైన గుంటలో వేసి, అందులో బార్బీని కూడా విసిరేశాడు. మళ్లీ మట్టి పోసి, గుంటను పూడ్చాడు. 'పెద్దయినాక మళ్లీ తీసుకొంటానమ్మా'

అన్నాడు. ఏమిట్రా ఇది అంటే, దిగులు చూపులు చూస్తూ. ఇది జబ్బో, సహజంగా వచ్చిన మార్పో అర్థం కాలేదు."

లైట్లు మళ్లీ వెలిగాయి. వీడియో కెమెరాలు నాలుగువైపుల నుంచి ఫోకస్ చేసుకొని, రికార్డింగ్ మొదలుపెట్టారు.

రామాయణ కాలం వెళ్లిపోయింది. మధ్యయుగాల నాటి చరిత్ర. దేవాలయాల ధ్వంసం మొదలైంది. మళ్లీ ఆధునికి యుగం. స్వాతంత్ర్య పోరాటం- అవిభాజ్యమైన హిందూ దేశం కోసం పోరాటం- చివరిగా 1998. పోఖ్రాన్ అణు విస్ఫోటనంతో రికార్డింగ్ ముగిసింది. సుదీర్ఘమైన డాన్స్ బాలే. మూడుగంటల్లో మొత్తం షూటింగ్ అయిపోయింది.

మధ్యాహ్నం పిల్లలకు, కళాకారులకు, యూనిట్ సిబ్బందికి విందు. విందు తరువాత ప్రివ్యూ.

నాయకులు వస్తారు. వాళ్లు మొత్తం క్యాసెట్ ఓకే చేస్తేనే ఈ ప్రాజెక్టు పూర్తి అయినట్టు. రీ-రికార్డింగ్ గదిలో సౌండ్ మిక్స్ చేసుకొంటూ ఎందుకో ఒక కలత లాంటి భావం. అనీజీగా ఉన్న మనసు. శబ్దాల మధ్య హఠాత్తుగా భిన్నంగా ఉన్న రమణ కంఠం. అది అపస్వరమో, లేదా మరొకటో- దాన్ని వివరించాలంటే డెసిబుల్స్ భాష సరిపోదని పించింది.

టీవీ స్క్రీన్‌పై భటుడి వేషంలో రమణ. అందులోనూ ఇమడలేక, వాడి శరీరంలో వణుకు. ఒక అవాంఛితాన్ని గురించి భయపడుతున్నట్లుగా. ఆ పార్ట్ కట్ చేద్దామని వేణుగోపాల్. అట్లాగే పాట మధ్యలోని అపస్వరాన్ని కూడా కట్ చెయ్యమని దయానిధి. చివరకు వీడియోలో ఎక్కడా రమణ లేడు. వాడి అపస్వరం లేదు. పూర్తిగా తొలగించాం. కానీ అది వీడియోలోంచి నా మనసులోకి ఫిక్స్ అయినట్లుగా, ఒక భవిష్యత్ సంకేతం లోపల దాచబడ్డట్టుగా -

ప్రివ్యూ గొప్పగా వచ్చింది. నాయకులు ఖుషీ అయ్యారు. అందరికీ శుభాకాంక్షలు చెప్పారు. పిల్లలకు, కళాకారులకు శాలువాలు కప్పి, స్వీట్లు పంచిపెట్టి, సంబరంగా ఉంది వాతావరణం.

మెల్లగా ఆ వాతావరణం నుంచి బయటపడ్డాను. స్టూడియోలో పనివాళ్లు వస్తువులన్నీ సర్దుతున్నారు. లైటు స్టాండ్లు, వీడియో కెమెరాలు, సీనరీలు, సెట్టింగ్‌లు- ఒక్కొక్కటీ సర్దుతున్నారు. మాస్కులన్నీ ఒక మూలన గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. బహుశా వాటి అవసరం ఇక లేదేమో?

ఒక దృశ్యం నన్ను ఉలిక్కిపడేలా చేసింది. గుట్టలు గుట్టలుగా ఉన్న మాస్కుల దగ్గరగా ఒంటరిగా రమణ ఒక్కొక్క మాస్కునే పరిశీలనగా చూస్తూ. హఠాత్తుగా మాస్కుల్లోంచి తను తొడుక్కున్న భటుడి మాస్కును బయటకు తీసి, కోపంగా నేలకేసి

కొట్టి, కాలితో బలంగా తొక్కాడు. పెళుసైన మాస్క్ పటపటమని విరిగిపోయింది. మాస్క్ ముక్కలు ముక్కలైన దృశ్యం నాకు దూరం నుంచైనా, స్పష్టంగా కనిపిస్తుంది.

అడుగుల శబ్దం విని ఉలిక్కిపడి వెనక్కు చూశాడు రమణ. వాళ్లమ్మ. ఆమె కళ్లు క్షణంపాటు, భయంతో రెపరెపలాడి, నాలుగువైపులా చూసి, భారంగా నిట్టూర్చి 'తప్పు!' అంది పెదవులపై వేలు పెట్టి చూపిస్తూ.

వాడి ముఖంలో విసుగు, అసహనం, దుఃఖం. త... త... త... మాట పూర్తిగా రావటం లేదు.

ఆమె పూర్తి చేసింది. త...పకు ప వత్తు ఇస్తే ప్ప...ప్పకు కొమ్ము ఇస్తే ప్పు... తప్పు. మెల్లగా చెబుతుంది. ఆమె కళ్లలో క్రమంగా ఆందోళన తగ్గింది. త...ప్ప...ప్పు...తప్పు. రమణ రెండు మూడుసార్లు రిహార్సల్స్ చేయటం మొదలుపెట్టాడు. వాడి భుజంపై చెయ్యివేసి నడిపించుకొని, జనం మధ్యకు నడిచింది.

ఒక దుఃఖపు పద్యంలా వాతావరణం. చుట్టూ కాంతిని కక్కుతోన్న ట్యూబ్‌లైట్లు. అంత వెలుతురులోనూ కనపడని చీకటేదో తరుముకొని వస్తున్నట్లుగా ఉంది. బయట అరుపులు, కేకలు. చిందరవందరగా శబ్దాలన్నీ వాటినన్నిటినీ చీల్చుకొని, ఆ ఒక్క శబ్దం-ప్రత్యేకంగా. ఆ కుర్రవాడి స్వరపేటిక చుట్టూ, వాడు పలికే పదాల చుట్టూ, మిస్టిలా, పొరలు పొరలుగా అల్లుకొన్నదాని పేరేమిటి?

రీ-రికార్డింగ్ రూమ్‌వైపుకు వెళ్లాను. టేప్ బయటకు తీసి, కత్తిరించబడ్డ దృశ్యాన్ని, శబ్దాన్ని మళ్లీ అతికించాను. ఒక సాక్ష్యంగా ఆ శబ్దం రీప్లేలో వినిపిస్తూనే ఉంది.

*ఆంధ్రభూమి, వారపత్రిక, 26-3-1999*